# పోయినోళ్ళు తీపి గురుతులు

పన్నెండేళ్ళ క్రితం హెచ్ వన్ విసా మీద నా అమెరికా ప్రయాణం.

అది నా అసలైన ప్రయాణం

అదే నిజమైన ఒడిస్సి

అదో ఫాంటసీ లోకం

ఓ కలల ప్రపంచం

ఓ కార్పొరేట్ కెమెలాట్ లాంటిది అందరికీ. అందులో సిలికాన్ వేలి

అయితే ఈ పన్నెండేళ్ళల్లో భారత దేశం వచ్చిందే మూడు సార్లు. పెళ్ళి చూపులు, పెళ్ళికి కోసం, నాన్నగారు పోయినప్పుడు, ఇంక హైదరాబాద్ రావాల్సిన పని లేదు. ఎందుకంటే అమ్మ నా దగ్గరికి వచ్చేసింది. చెల్లి వాషింగ్టన్‌లో ఉంటోంది. హైదరాబాదునే మర్చిపోతున్న నాకు మా పూర్వీకులు ఉన్న ఊరు నుంచి ఫోన్ వచ్చింది.

"ఈ మధ్య కురిసిన వర్షాలకి, మీ ఇంటి తూర్పున ఓ వైపు గోడ కూలి, మీ పక్కింటి జగన్నాథం గారింటి వైపు పడింది. దాంతో రెండింటికి మధ్యనున్న గోడ కూలిపోయింది. అలా కూలిపోతున్న ఇల్లుని ఉంచడం మంచిది కాదు. అందుకని నువ్వు ఒకసారి రావాలి. మీ నాన్నగారి తర్వాత ఆ ఇల్లు నీకే వస్తుంది. కాబట్టి అమ్ముదామను కుంటే కొనుక్కుందుకు ఇద్దరు ముగ్గురు సిద్ధంగా ఉన్నారు." అదీ సారాంశం.

"ఎవరైనా కొనేవాళ్ళు, మంచివాళ్ళు అని అనిపిస్తే అమ్మేయి. మీ నాన్నగారే అక్కడ లేరు. నేను ఒక్క రోజు కూడా ఆ ఇంట్లో ఉండలేదు. మొదట్నించి నార్త్‌లో ఉండటంతో, అక్కడ మన వాళ్ళు ఎవరూ ఏ కార్యం చెయ్యక పోవడంతో అక్కడికి వెళ్ళే అవకాశం రాలేదు. ఇన్ని రోజులూ మీ నాన్నగారు అమ్మనివ్వలేదు. ఆయనకి అదో సెంటిమెంట్. ఇప్పుడు మీ నాన్నగారు లేరు కాబట్టి నీకూ ఆ

ఇల్లు వద్దనిపిస్తే, అక్కర్లేదనుకుంటే నిక్షేపంగా ఆ పని చెయ్యి."

అదీ అమ్మ అభిప్రాయం.

నా భార్య సమీర కూడా ఇంచుమించు అదే అర్థం వచ్చేట్టుగా మాట్లాడింది.

మా ఊర్నించి నాకు సమాచారం ఇచ్చిన ఆయన పేరు నారాయణ. ఫోన్ చేసి ఏ రోజున వచ్చేది, ఎలా వచ్చేది చెప్పాను. ఇల్లు అమ్మే ఉద్దేశం ఉందని కూడా చెప్పాను.

ఫలితం నాలుగోసారి ఇండియా.

హైదరాబాద్ ఏర్-పోర్ట్‌లో దిగాను. బయటి కొచ్చాను. 'ఎవర్నైనా పంపుతాను' అంటూ నారాయణరావుగారు ఫోన్ చేసారు. 'ఎలా గుర్తు పట్టడం,' అంటూనే అటూ ఇటూ చూస్తూ ముందుకి నడుస్తున్నాను.

త్రినాథ్, శాన్‌హౌసే. కాలిఫోర్నియా. ప్లాకార్డు చూపిస్తున్న మనిషిని చూసాను.

అతను పాత సినిమాల్లో మురళీమోహన్‌లాగా ఉన్నాడు. కొంచెం రంగు తక్కువ,

ఎక్కువ ఏళ్ళు ఆంధ్రాలో లేకపోయినా, తెలుగు సినిమాలు అమెరికా వచ్చాకా చాలా చూసాను. కాబట్టి హీరోలు అందరూ తెలుసు.

నారాయణగారు పంపిన మనిషి అయ్యి ఉంటాడు... కానీ..... నమ్మడం ఎలా? సినిమాల్లో లాగా..... నా కోసం వచ్చిన అసలు మనిషిని దాచి వేరే ఎవరైనా కావచ్చా!.....

అయినా నా దగ్గరేముంది? నెగ్లిజిబుల్ అమౌంట్. ధైర్యంగా అతని ముందు కెళ్ళి తలూపాను.

ఏవో రెండు ప్రశ్నలు వేసాను. సరిగ్గానే జవాబులిచ్చాడు. ఎందుకైనా మంచిదని సెల్ తీసి నారాయణ రావుగారికి ఫోన్ చేసి కనుకున్నాను.

"ఆ టాక్సీ అమలాపురందే, నిర్భయంగా అందులో రావచ్చు. ఇక్కడి వాళ్ళని హైదరాబాద్‌లో దింపాకా ఖాళీగా వస్తోందని తెలిసి అదే టాక్సీని

మాట్లాడాము." నారాయణ గారి సమాధానం ధైర్యాన్నిచ్చింది.

నాకు టాక్సీ డ్రైవర్లంటే మంచి అభిప్రాయము లేదు. ఛాన్స్ దొరికితే దోచేస్తారు. మీటరు సరిగ్గా ఉండదు. మోసాలు, చేస్తారు. విదేశాల్నించి వస్తున్నారంటే, ఏదో మత్తు చల్లేసి, సామాను తీసుకెళ్ళిపోతారు. ఆడవాళ్ళంటే ఒక్కోసారి రేప్‌ల్లాంటివి కూడా చేస్తారు. ఎన్ని చదవలేదు? ఎన్ని వినలేదు? ఆ జాతి అలాంటిదేమో అన్న అనుమానం కూడా ఉంది.

సాలోచనగా అతన్నే చూస్తూ హేండ్‌బాగ్, చిన్న సూట్‌కేస్ చేతిలోకి తీసుకున్నాను.

ఎందుకైనా మంచిదని, ఇంటికి ఫోన్ చేసాను. టాక్సీ నంబరు అది ఇచ్చి, టైము చెప్పి ఎన్ని గంటల తర్వాత అమలాపురం చేరతానో చెప్పి టాక్సీ దగ్గర నుంచున్నాను.

మురళీమోహన్, నా సామాను వెనకాల పెట్టి, డిక్కి తలుపు మూసి కారు వెనక తలుపు తీసాడు. అలాగే తలుపు పట్టుకున్నాడు.

"లోపల కూచోండి"

నేను కూచున్నాక, తను ముందు కూచుని స్టార్ట్ చేసాడు.

సర్దుకుంటూ చూసాను. నా ముందున్న ఓ అట్టముక్కని.

దాని మీద తెలుగులో రాసి ఉంది. తెలుగు చిన్న క్లాసుల్లో, హైదరాబాద్‌లో ఉన్నప్పుడు నేర్చుకున్నదే, ఆ తర్వాత స్పెషల్ ఇంగ్లీషు తీసుకుని నార్త్‌లో చదివాను. తెలుగులో పూర్... ముఖ్యంగా రాయడం చదవడంలో.

"ఏమిటిది? తెలుగులో ఉంది....." కూడా బలుక్కుంటున్నాను. ఒక్కొక్క అక్షరం "ప్రయాణీకులు నా దేవుళ్ళు" నవ్వాను. అంతకుముందున్న ఆందోళన తగ్గింది. అతనే చెప్పాడు అందులో ఉన్నది. ప్రయాణీకులు నా దేవుళ్ళు నాకు అన్నదాతలు, అన్నపూర్ణలు.

దానికింద ఇంగ్లీషులో, అందంగా ఓ వైపు ఒరిగి ఉన్న నల్లటి అక్షరాలు వి. సత్యనారాయణ. బి ఎస్సీ (మేథ్స్) అని ఉంది.

"ఎందుకలా రాసావు? నీ డ్యూటి నువ్వు చేస్తుంటే, వాళ్ళ డ్యూటి నీకు డబ్బు ఇవ్వడం. జస్ట్ బిజినెస్."

"కానీ నేనలా అనుకోను," అని ఓ ఎర్ర గులాబీని, కాడ, నాలుగు ఆకులతో ఉన్నదాన్ని అందించాడు.

"థాంక్యూ" అని తీసుకుని "ఏమిటీ మర్యాద?" అన్నాను సున్నితంగా.

"నాది కేవలం బిజినెస్ కాదు. అంతకు మించినది." అంటూ వెనక్కి తిరిగి చిరునవ్వు నవ్వాడు.

మళ్ళా భయపడ్డాను, అందులో ఏదైనా స్ప్రే చేసి ఉంటాడా! "బావుంది" దాన్ని పక్క నుంచాను. వాసన చూడకుండానే.

"నేను వేరే వాళ్ళతో మంచిగా ఉంటేనో కదా, వాళ్ళు నాతో మంచిగా ఉంటారు. నేను ఎదుటి మనిషిని ప్రేమిస్తే, నన్ను వాళ్ళూ ప్రేమిస్తారు. ఆర్కిమెడిస్ ప్రిన్సిపల్ లాగా. ఫిజిక్స్‌ని జీవితానికి అప్పుడప్పుడు అప్లై చేస్తుండాలి."

"ఇంట్రెస్టింగ్ అయితే ఫిజిక్స్ అంటే ఇష్టం అన్నమాట." రిలాక్స్‌డ్‌గా ఫీలయ్యాను. భయం, అనుమానం తగ్గింది "మరి ఈ టాక్సీ ఏమిటి?"

"ఏం చెయ్యమంటారండి, చదివింది తెలుగులో, ఇంగ్లీషు వీక్. దీనితో మంచి ఉద్యోగాలు ఆఖరికి కాల్ సెంటర్స్‌లో ఉద్యోగాలు కూడా వెనక్కి వెళ్ళిపోతున్నాయి. స్పోకెన్ ఇంగ్లీషు, క్లాసులు, పుస్తకాలు అన్నీ అయ్యాయి. లాభం లేకపోయింది. అసలు మాట్లాడుతూంటేనే వస్తుంది. అందుకని నా ఇంగ్లీషు ఇంప్రూవ్ చేసుకుంటూ నలుగురితో మాట్లాడుతుంటే భయం, జంకుపోతాయని ఈ డ్రైవింగ్ నేర్చుకుని ఈ లైన్‌లోకి వచ్చాను. అనుభవాలు, ప్రాక్టికల్స్ గురువులు."

"దార్లో చైతన్యపురి పళ్ళ మార్కెట్ వస్తుంది. ఏమైనా పళ్ళు కొనుక్కుంటారా!"

"సరే." అన్నాను.

మరి కాస్సేపటికి టాక్సీ ఆపి మార్కెట్లోకి వెళ్ళాడు. చైతన్యపురి రానేవచ్చింది.

ఓ పది నిమిషాలకి రెండు బ్యాగులు నా పక్కనుంచి మళ్ళా స్టార్ట్ చేసాడు. కాసేపు మౌనంగా ఉన్నాం.

"అమెరికా గురించి చెప్పండి. నేను కన్న కలల్లో ఒకదాని రూపం అమెరికా."

ఓహో ఈ రూట్లో వస్తున్నాడన్నమాట. కిటికీలోంచి బయటకి చూసాను. రాళ్ళు, పిచ్చి మొక్కలు అడివిలా ఉంది. మళ్ళా భయపడ్డాను. పక్కకి మళ్ళించి పీక పిసికేయుడు కదా! బింకంగానే ఉన్నాను.

"ఏం చెప్పాలి? ఆశాజనకంగానా! నిరాశాజనకంగానూ! బొమ్మా బొరుసూ రెండూ ఉన్నాయి......"

"వద్దులెండి నా కలల ప్రపంచం నాకు ఇన్ఫర్మేషన్ ఇస్తుందిలెండి." అంటూ ఎడమ చేత్తో ఏదో తీయడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ కదలికలు అన్నీ గమనిస్తున్నాను. ఏం తీయడానికి ప్రయత్నిస్తున్నాడు? పిస్తోలు..... కత్తి....

ఏమిటిది? ఎందుకింత భయపడుతున్నాను? ఒంటరి ప్రయాణం అనా! అయినా ఇంతకన్నా భయంకరమైన వ్యక్తులతో అమెరికాలోనే భయపడలేదు. అక్కడి కన్నా ఇక్కడి వాళ్ళని గుర్తించడం కష్టం అనా!

మెల్లగా మొబైల్ తీసి ఫోటోలు తీసి స్టోర్ చేసాను. సేఫ్టీసైడ్ "దాదాపు పదిగంటల ప్రయాణం చెయ్యాల్సి ఉంటుంది. కొంచెం టైంపాస్..... ఇది చూడండి....." అంటూ వెనక్కి తిరగకుండానే ఓ పుస్తకం ఇచ్చాడు, సీటు పైనుంచి.

నోట్ బుక్ సైజులో ఉన్న డైరి.

లోపలి పేజీలో వి. సత్యనారాయణ బి.ఎస్సీ (మేథ్స్) అని ఉంది. పేజీలు తిప్పాను. గాంధీగారి కొటేషన్స్. ఏవో సామెతలు, నీతి వాక్యాలు కలల మీద కొటేషన్స్ అన్నీ తెలుగులో ఉన్నాయి.

ఓ పేజీలో ఇంగ్లీషులో ఉంది.

హింసకి దూరం, చట్ట విరుద్ధమైన లైంగిక సంబంధానికి, మత్తు

పదార్థాలకి దూరం. అందరికీ సహాయ పడడం. దయగా మెలగడం.

ఏసు క్రీస్తు వాక్యాల్లాగా అనిపించింది.

"అయితే సత్యనారాయణ....."

"సత్తిబాబు అనండి. అంతా నన్ను సత్తి బాబు అంటారు." అంటూ మధ్యలో అన్నాడు.

"ఓ.కే. మరి సత్తిబాబు, ఇవి నువ్వు పాటిస్తావా! పాటిస్తున్నావా!"

"ఆయ్!" తలూపాడు వెనక్కి తిరక్కుండానే.

"కష్టం కాదా!" పుస్తకాన్ని అలాగే ఒళ్ళో తెరిచి ఉంచాను.

"మంచి ప్రాక్టీస్ చెయ్యడం చాలా కష్టమే నండి. కానీ.... ప్రయత్నిస్తుంటాను. ఓ సారి రాజమండ్రికి ఎవరో పీఠాధిపతి వచ్చారు. ఇందుపల్లి, బండార్లంక, పేరూరు మంచి ఐదారు ట్రిప్పులు వేసి అందర్నీ తీసుకెళ్ళాను. ఆయన బోధలు విన్నాను. మంచిని ఎవరు చెప్పినా వినడంలో తప్పు లేదు. ఎలాంటి వాళ్ళనయినా క్షమించమన్నారు....."

గట్టిగా నవ్వాను." ఎలా సాధ్యం?..... వెర్రితనం....."

"వాలిబాల్ ఆడే బంతి నిండా గాలి నింపి గోడకి కొడ్తే వెనక్కి వస్తుంది... అందులో గాలే లేకపోతే, గోడకి తగిలిన వెంటనే తప్పగా అయ్యి కింద పడిపోతుంది."

సత్తిబాబు సింపుల్‌గా చెప్పాడే కానీ, నాకే దాన్లో అర్థం వెతకడానికి చాలా టైము పట్టింది.

ఎపిక్యూరస్‌లో అన్నం తిన్నాం. టైం పదకొండు కూడా కాలేదు. కానీ ఆకలి వేసింది. నిద్ర వచ్చేసింది. అలాగే ఒరిగి పడుకున్నాను. ఎంత సేపు పడుకున్నానో తెలీదు. సత్తిబాబు లేపితే తెలివొచ్చింది.

"ఎక్కడున్నాం సత్తి బాబూ!"

"రావులపాలెం వచ్చేసాం అండి. కొంచెం కాఫీ తాగండి. ఇక్కడ బావుంటుంది. కూడా చురుగ్గా ఉంటారు. నేను వెళ్ళి తీసుకువస్తాను" అంటూ

వెళ్ళాడు.

టైం మూడున్నర, కానీ..... హాయిగా, చల్లటిగాలి వేస్తూ ఉంది. బాగానే తీసుకొచ్చాడు. మంచి డ్రైవరే అన్నమాట.

ఓ ప్లాస్టిక్ గ్లాసులో కాఫీ నాకిచ్చి తనోటి తీసుకున్నాడు.

"నేను అమెరికా నుంచి వచ్చానా! లేకపోతే అందరితోనూ ఇలాగే ఉంటావా?"

"ప్రయాణీకులు నాకు అన్నదాతలు... వాళ్ళకి సహాయపడటం నా డ్యూటీ."

నవ్వాను.

మళ్ళా ప్రయాణం

గోదావరి కాలవ మీద నుంచి చల్లటిగాలి వరి పొలాలు. కనుచూపు మేర వరకూ కొబ్బరి చెట్లు, ఎగురుతున్న కొంగలు ఎంతందం!

ఇల్లు ఉన్నా, కూడా పొలాలు అవీ లేకపోవడం వల్ల మాకు ఈ ఊళ్ళు వెళ్ళే అవకాశం ఎప్పుడూ కూడా రాలేదు.

"ఎప్పుడు చూడని కోనసీమకు వెళ్తున్నావు, నీవు వినగలిగితే, ఆ గాల్లో సంగీతం వినపడుతుంది." అన్న రాజు మాటలు గుర్తుకొచ్చాయి.

రాజు నాన్నగారికి వందెకరాలుంది. పెద్ద కుటుంబం. అందరూ ఇక్కడే ఈ వైపునే ఉంటారు. ఏదో ఫంక్షన్‌ల మూలంగా ప్రతీ ఏడాది ఈ వైపుకు వస్తూంటాడు.

కిటికీ అద్దం సగం దింపి కళ్ళు మూసుకుని, వీస్తున్న గాలిలో ఏదైనా సంగీతం వినిపిస్తుందా అని చెవులు రిక్కించుకున్నాను.

"త్రినాథ్‌గారు, ఒక్కటడగనా!"

నన్ను అమెరికా తీసుకెళ్ళండని అడుగుతాడా!

"ఈ మధ్య చాలా మంది అమెరికానుంచి వచ్చేస్తున్నారుట కదా, ఎందుకని?"

"చాలా కారణాలుంటాయి....."

"అవే... ఏవిటని? ఎందుకంటే అమెరికా అంటే మోజున్న నాలాంటి వాళ్ళే నాకింత వరకూ కనపడ్డారు."

"కొంత మంది పిల్లలు కోసం..... కొంత మంది ఆత్మని వెతుక్కోవడం కోసం, కార్పొరేట్ లాడర్‌ని ఆధ్యాత్మికతకి బదులిచ్చి....."

"అంటే... శాంతి వెతుక్కోవడానికన్నమాట..." అన్నాడు సత్తిబాబు.

"అవును జీవితం అంటే డాలరేకాదు. డాలర్‌కి అవతల, తర్వాత కూడా జీవితం ఉందనుకునేవాళ్ళు..."

"అంతేనా! హృదయంలో ఓ చిన్న ముక్కని ఇక్కడ వదిలేసి వెళ్ళిన వాళ్ళు కూడానా....."

"ఎమోషనల్ వాక్యం... కావచ్చు..."

చిన్న ముక్క వదిలినా, పెద్ద ముక్క వదిలినా, మనిషిలో ఎంత మార్పు వచ్చినా ఒరిజినాలిటి ఎక్కడికి పోతుంది.

"ఒరిజినాలిటి... ఒరిజినాలిటియే మూలం అభిప్రాయాలకి రంగులెన్నివేసినా, అవి ఎక్కడికి పోతాయి? మూలం ఎప్పటికీ మూలమే."

జీవితానికి కోణాలు చూపిస్తున్నాడు.

"ఎక్కడున్నా మనం మనమే. మెక్సికో మ్యూజియంలో పెట్టినా, ఆఫ్రికాలో ఉంచినా మనం గతం గతమే. మన వ్రేళ్ళ గురించి ఇప్పుడు మనం యిప్పుడు వదిలేస్తే, ముందు తరాల వాళ్ళు మన గురించి ఏంథ్రోపాలజీలో చదవాల్సి వస్తుంది."

తెలివైనవాడు నేను ఎందుకు వస్తున్నానో సత్తిబాబుకి తెలుసన్నమాట. ఇన్‌డైరక్ట్‌గా నన్ను అంటున్నాడా! ఇప్పుడు నేనెందుకు ఈ ఊరు వస్తున్నానో ఇతగాడికి చెప్పాల్సిన అవసరం ఉందా! లేదా! అది పర్సనల్లోకి వస్తుందా!

వెనక్కి తిరిగి, రెండు పుస్తకాలు నాచేతికిచ్చాడు.

"ఏమిటీ?" అంటూనే ఆ రెండిటిని అందుకున్నాను.

ఒకటి అమెరికాలో జీవితం.

మరొకటి ఇంగ్లీషు డిక్షనరి.

"అవి నా కలలు. ఇంకా ఆకారం రావడంలేదు. ఎలాగైనా అమెరికా వెళ్ళాలి. అందుకు ఇంగ్లీష్ బాగా మాట్లాడటం రావాలి."

ఒకప్పుడు నాకు బోల్డు కలలు నన్ను ఏల్తూండేవి.

అవి బొంబాయి దాటి, అరేబియా దాటి, యూరోపుదాటి, అట్లాంటిక్ దాటి, ఆతీరాన కాలుపెట్టడం వరకూ వెళ్ళి ఆగిపోయేవి.

ఆనాటి ఆ కలలకి అంత బలం ఉండేది. ఎంతో శక్తి. అందుకే అన్ని ప్రయత్నాలు, అన్ని ఇంటర్వ్యూలు, రాత్రింబవళ్ళూ కంప్యూటర్ ముందు గడపడం... కల.... నిజం కావాలని...

మరి సత్తి బాబు కల... నిజం అవుతుందా!

ఎల్‌డొరాడో అవుతుందా!

"హైదరాబాదు వెళ్ళేటప్పుడు నా టాక్సీ కావల్సొస్తుందా?"

"ఏం నీకు పనేమయినా ఉందా? రావడానికి కుదరదా?"

"మా అమ్మకి ఫైలేరియా ఉంది. ఆ కాలు మూలంగా జ్వరం వచ్చింది. ఆచారిగారు మందు పనిచెయ్యలేదు. అమలాపురం తీసుకెళ్ళి మందు ఇప్పించాలి. నాలుగు రోజుల క్రితం ఇల్లు వదిలాను. ఇద్దరు పిల్లలున్నారు, నా భార్య, వాళ్ళు నాకోసం ఎదురు చూస్తారు. నాన్నగారు వయసు మళ్ళినాయన... ఇంత మందికి నా అవసరం ఉంది. అంత డబ్బు కూడా కావాలి కదా! ట్రిప్పుంటే ఇంకొంచెం డబ్బు వస్తుంది నా సొంతంగా ఓ టాక్సీ కొనాలి", ఇది ఇప్పటి కల.

"మీ ఇల్లు ఎక్కడ?"

"విలసవల్లి వెళ్ళే దారిలో..."

"అయితే ఇప్పుడు మనం అమలాపురం హోటల్లో ఏదో కాస్త తిని, ఫ్రెష్ అయి మా ఊరెళ్ళి, అక్కడ కొంచెం పని అదీ చూసుకున్నాకా, నన్ను హోటల్లో దింపి నువ్వు మీ ఇంటి కెళ్ళిపో, రేపొద్దున్నే వచ్చేసెయ్యి."

హోటల్లో టిఫిన్ తింటున్నప్పుడు నేను వచ్చిన పని చెప్పాను నవ్వాడు.

"మాకు ఇంటర్‌లో ఇంగ్లీషులో ఓ పోయెం ఉంది రాబర్ట్ ఫ్రాస్ట్ అని గుర్తు 'మెండింగ్ ద వాల్' నా మనసులో ఈ రోజు వరకూ ఆ పద్యం అలాగే ఉంది. మంచి ఇరుగు పొరుగుకి మధ్య గోడ అక్కర్లేదు అని, ఇరుగు పొరుగూ మంచిగా ఉంటాలంటే మధ్య గోడ ఉండాలని ఇద్దరి అభిప్రాయాలు, మానవ సంబంధాలు, ప్రవర్తన గురించిన ఓ అందమైన పద్యం... అయితే గోడ కట్టించదానికి వెళ్తున్నారన్నమాట."

"అంతేకాదు వీలును బట్టి అమ్మేద్దామని." అంటూ బయటకి నడిచాను.

"మరోసారి ఆలోచించుకోండి." కారులో కూర్చున్నాక అన్నాడు.

"పెద్దగా ఆలోచించడానికేం లేదు. ఆ ఇల్లు మేం కట్టించలేదు. ప్రతీ గది వెనకా ఓ కథ లేదు, ప్రతీ ఇటుక, గోడ వెనక ఏ విధమైన ఎమోషనల్ ఫీలింగ్ లేదు. పెద్దగా కలలు కంటూ కట్టించలేదు. అమ్మెయ్యడం మంచిది. రిపేర్లు చేయించి ఉంచడం కన్నా అది నయం కదా!"

మరో అరగంటలో ఓ యింటి ముందున్నాము.

"నేను జగన్నాధాన్ని. నీతో ఫోన్లో మాట్లాడింది నేనే." అంటూ దబ్బ పండు ఛాయలో ఉన్న మనిషి కారు దగ్గరికి వచ్చారు.

వయసు యాభై పైనే ఉంటుంది.

తెల్ల పంచ, చేతులున్న తెల్ల బనీను

సినిమాల్లో ఉండే డబ్బున్న తండ్రిలా అనిపించాడు.

"నారాయణగారు.....?" అంటూ ఆగాను

"పక్కనున్న మనిషిని చూసింది, ఇతనే నారాయణ..... ఇతను కూడా మీకు రెండు సార్లు చేసాడు అని అన్నాడు..."

"రండి" ముందుకు నడిచాడు. అంటూ అరుగు మీద ఉన్న కుర్చీ చూపించాడు.

"ఇది మీ యిల్లే ఈ ఇల్లు మీ ముత్తాతగారు కట్టించారు. ఆయన

చయనం చేసారు. పచ్చటి మనిషి రుద్రాక్ష మాలలు, దానిమ్మ పువ్వు రంగు శాలువా వేసుకుని వెళ్తుంటే ఎదురొచ్చిన వాళ్ళు దండాలు పెట్టేసేవారుట. మేం విన్నదే చూళ్ళేదనుకో, ఆయన దూర్వాసులు, విశ్వామిత్రులు, పరుశురాములు కల బోసిన మనిషి, ఆయన ఫోటో ఉంది చూద్దువురా... లోపలికెళ్దాం." అంటూ ఆయన అరుగు దిగి ఇంటి లోపలి కెళ్ళాడు. నేను వెనకాలే వెళ్ళాను.

పెద్ద మండువా చుట్టూ సావిళ్ళూ, మూలల్లో గదులు ఇలా చూస్తుండగా, ఈ లోపల ఎవరో కాఫీలందించారు.

కాఫీ తాగుతూ గోడలకి ఉన్న ఫోటోలు చూడడం మొదలుపెట్టాను.

చాలా ఫోటోలున్నాయి.

ఓ ఫోటో చూసాను. ఆ ఫోటో పక్కనే మా తాతగారి ఫోటో ఉంది. ఆయన యజ్ఞం చేసి సోమయాజులైపోయారు. ఆ ఫోటో పక్కనే మా నాన్నగారిది చాలా చిన్నప్పటి ఫోటో ఉంది.

ఆ ఊరికి వచ్చిన పెద్దవాళ్ళు, సినిమా వాళ్ళు మా ఇంట్లో షూటింగులు చేసుకునేవారుట. ఆ ఫోటోలు కూడా ఉన్నాయి.

"ఈ వైపున నిత్యం అగ్ని హోత్రం అలా వెలుగుతూండేది. ఎప్పుడూ ఏవో వల్లె వేయడాలు. నేర్చుకునే వాళ్ళతో, పలకరించే వాళ్ళతో ఈ అరుగులు నిండిపోయేవి. ఇందాక మనం చూసాం చూడూ! ఆ మండువా పడి చుట్టూరా ఆడవాళ్ళు కూచుని లలితా సహస్రనామం, మంత్ర పుష్పం, అష్టకాలు, శ్లోకాలు చదువుతూండేవారు."

వింటూంటే అపూర్వమైన భావం నాలో కలిగింది.

"మీ తాతగారు పోయాక, మీ నాన్నగారు ఒకటి రెండుసార్లు వచ్చి వెళ్ళారు. కాని ఏం చెప్పలేదు. హఠాత్తుగా పోయారు. ఇప్పుడు ఈ గోడ వర్షాలకి పడిపోవడంతో మీకు ఫోన్ చేసి రప్పించాము." ఆ తర్వాత పడిపోయిన గోడ అదీ చూపించారు. ఎంత పెద్ద ఇల్లో! ఇక్కడి నుంచి ఆ మూల వరకూ ఉంది. ఓ వీధిలో ఎంట్రెన్స్ అయితే వెనక వీధిలోకి పెరటి తలుపు.

"ఎవరికైనా అద్దెకివ్వక పోయారా!"

"ఎవరో ఒకళ్ళు ఉంటున్నారు. ప్రసుత్తం నేమాని శర్మ అని మన ఊరి శివాలయం పూజారి ఉంటున్నాడు. ప్రస్తుతం వాడి పెళ్ళాం పురిటికెళ్ళింది. శర్మ గుళ్ళోనే ఉంటాడు. పిలుద్దామా!" వారించాను.

బాగా చీకటి పడిపోయింది.

గుడ్డిదీపాలు బల్బులున్న చోట వెలిగాయి.

"పదండి, మా ఇంటికెళ్దాం." అంటూ నారాయణగారు ఎదురింటి వైపు వెళ్ళారు. నేనూ, మిగిలిన వాళ్ళం ఆయన వెనకాలే వెళ్ళాం.

లోపల ట్యూబ్ లైట్లు, ఫాను, కొత్తగా వెల్ల వేసిన హాలు, కేన్‌కుర్చీలు, ఉయ్యాల బల్ల.

"ఇదిగో త్రినాథూ! ఇల్లు అమ్ముతానంటే ఇద్దరు రెడీగా డబ్బుతో సహా ఉన్నారు. మొదటిది సూర్యనారాయణ రెండోది మీ ఇంటి పక్కనున్న జగన్నాథంగారు ఎవరికి అమ్మినా పర్వాలేదు మరొకళ్ళకి కోపం రాదు." నారాయణగారు టాపిక్‌లోకి వచ్చేసారు.

"ఎంతుంటుంది. ధర?" అన్నాను డైరక్ట్‌గా టాపిక్‌లోకి వెళ్ళాను.

"రెండు మూడు లక్షలు ఇంటికి, వెనకాల కొబ్బరి చెట్లున్నాయి. కాబట్టి మరో లక్ష. మీ ముత్తాత ఇల్లు కాబట్టి మరో లక్ష మొత్తం నాలుగైదు లక్షలు... ఏమంటావు? అమ్మకి ఫోన్ చేసి సలహా తీసుకుంటావా?" అంటూ నారాయణగారు వ్యాపార ధోరణిలో చెప్పేసారు.

'ఓ నెల జీతం' అని మనసులో అనుకున్నాను.

పవిత్రమైన నా తాత ముత్తాతల గతానికి విలువ. అది. తప్పు చేస్తున్నానా! అమ్మేసి నా రూట్స్‌ని పీకేయనా! ఇదే సెంటిమెంట్‌తో నాన్నగారు అమ్మ లేదా! ఆలోచించుకోవాలి టైము కావాలి.

"ఏ సంగతి ఆలోచించుకొని చెప్తాను. రేపొద్దున్నే వస్తాను." అంటూ అక్కణ్ణించి కదిలి కార్లో కూర్చున్నాను...

అంతా వచ్చి కారు చుట్టూ నుంచున్నారు. మరోసారి వాళ్ళకి చెప్పాను.

హోటల్ గదిలో మర్నాడు.....

అద్దంలో మొహం చూసుకుంటూ డ్రెస్ చేసుకుంటున్నాను. ఆ ముక్కు.. లావుగా ద్రావిడ ముక్కే.. ఎక్కడపోతాయి పోలికలు! ఆర్యులు, ద్రావిడులు చిన్నప్పుడు చదువుకున్నది అలా – అలా ఆ పోలికలు అన్ని వేల ఏళ్ళ నుంచి అలాగే వస్తున్నది (నిజమేనా! ఇది జెనిటిక్స్ ఆంథ్రోపాలజీలోకి వస్తుందా!)

ఎంత మంది ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్‌లు, వడ్రంగి వాళ్ళు ఆర్కిటెక్ట్‌లు ఎన్ని మార్పులు చేసినా నా రూట్స్ మారిపోతాయా! నా ఊరు ఇది కాకుండపోతుందా! నేను ద్రావిడుని కాకుండా పోతానా,

ఆ కత్తిరించిన జుట్టుని కట్టేసినా, విరబోసుకున్నా, పాంటేసినా, చీర కట్టుకున్నా మూలం అదేగా! కోనసీమ పిల్లే కదా నా భార్య సమీర!

మా ఇంటిని సూర్నాయణగారు కొన్నా, జగన్నాథంగారు కొన్నా, మరో వెంకయ్యగారు కొన్నా, ఆ ఇంట్లోని పవిత్రత చయనం, యజ్ఞం, నిత్య వేదపారాయణ వల్ల వచ్చినది, ఎక్కడ పోతుంది. ఆ ఇంటి అణువణువులో అంటి పెట్టుకుని ఉంటుంది. నా పిల్లలకి ఈ యింటి గురించి మా పూర్వీకుల గురించి, ఈ ఊరి గురించి, ఏం తెలుస్తుంది? ఎలా తెలుస్తుంది? దీన్ని ఈ ఇంటిని అమ్మేసి ఓ తప్పు చేస్తున్నానా!

కొన్ని జనరేషన్స్ తర్వాత మా వాళ్ళు మరో 'రూట్స్' నవల రాయాల్సి వస్తుందేమో! నేను అమ్మి తప్పు చేస్తున్నానా! అమ్మకపోతే కనీసం ఈ పల్లెటూరు పేరు పిల్లల నోట్లోనయిన ఉంటుంది.

సత్తిబాబు వచ్చాకా టిఫిన్ తిని మళ్ళీ పల్లెటూరు కెళ్ళాం. జగన్నాథంగారు ఎర్ర పట్టుపంచతో, మెరిసిపోతున్న రాగి చెంబుతో ఎదురొచ్చారు. ఆయన పక్కనే మరో మనిషి వీబూది రేకలు వయసు పాతిక ఉండవచ్చు.

"గుళ్ళోంచి వస్తున్నాను. మీ ఇంట్లో ఉండే నేమాని శర్మ ఈయనే." ఈ లోపల నారాయణగారు మరో నలుగురు వచ్చారు. అందరికీ కాఫీలు ఇచ్చారు.

"నేను మనసు మార్చుకున్నాను. ఇల్లు అమ్మడం లేదు. ఇల్లు బాగు చెయ్యడానికి డబ్బు ఇస్తాను. ఈ ఇంటిని ఈ ఊరికే అంకితం చేస్తున్నాను. పెళ్ళిళ్ళకి, పేరంటాళ్ళకి, వంటలు చేసుకోవడానికి, భోజనాలకి, ఈ ఊరికి వచ్చే వాళ్ళు ఉండడానికి వాడండి. అందరి ముందరా ఎందుకు చెపుతున్నానంటే ట్రాన్స్‌పెరెన్సీ ఉండాలని, మన రాష్ట్రంలోని దేవాలయాల భూముల్లాగా ఎవరూ ఆక్రమించకుండా ఉండటం కోసం." అంటూ ఓ రెండు చెక్కులు జగన్నాథంగారికిచ్చాను.

"శర్మగారిని ఈ ఇంట్లోనే ఉండమనండి. ఈ ఇంటిని శుభకార్యాలకి వినియోగించండి." చాలా బావుంది. మంచి పని చేశావు... అని అందరూ మెచ్చుకున్నారు. వాళ్ళందరికీ మరోసారి చెప్పి అనుకుంటూండగా కారెక్కాను.

నా హయాంలో నేను అమ్మలేదు. మా నాన్నగారి లాగే నాలో కూడా ఎక్కడో సెంటిమెంట్ అది రూట్స్. నా పిల్లల్ని ఓ రోజు తీసుకొచ్చి చూపిస్తాను.

సత్తిబాబు తల్లికి అస్సలు బాగోలేకపోతే, నాతో రాలేకపోయాడు. 'గుడ్‌బై' చెప్పి మరో టాక్సీ ఎక్కాను.

నాకు, సత్తిబాబుకి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరగడానికేం లేదు. నాకు తెలుగు సరిగా రాయడం రాదు. పైగా అడ్రసు కూడా తీసుకోలేదు.

కానీ, -

చిన్న వయసులో, చదువుకుని కూడా, ఆ పల్లెటూళ్ళో, టాక్సీ నడుపుకుంటూ, నీతి నియమాలు పెట్టుకుని, సాధ్యమైనంత పాటిస్తూ ఓ మంచి నాగరికుడిగా వెలిగే సత్తిబాబు నాకు చాలా నచ్చాడు. అసలు మర్చిపోలేకపోతున్నాను. పెద్ద బాలశిక్షని వెతికి, అక్షరాలు సాయింపట్టాను. అమ్మ సహాయం, సమీర సహాయం తీసుకుని తెలుగులో ఓ ఉత్తరం జగన్నాథంగారి అడ్రసుకి సత్తిబాబుకి రాసి, జగన్నాథం గారికి ఫోన్ చేసి చెప్పాను. ఆ ఉత్తరాన్ని సత్తిబాబుకి ఇవ్వాల్సిందని.

చాలా రోజులకి సతిబాబునుంచి ఉత్తరం వచ్చింది. ఈ మధ్య కాలంలో ఉత్తరం మొహం చూళ్ళేదు. ఇంగ్లీషులో రాసాడు.

"చాలాసార్లు డిక్షనరి చూసి, ఎన్నో రఫ్ కాపీలు రాసిన తర్వాత ఈ

ఉత్తరం ఈ స్థితికొచ్చింది. మీరు చాలా అదృష్టవంతులు. అమెరికా లాంటి గొప్ప దేశంలో ఉన్నారు. నా కష్టాలు నన్ను వదలడంలేదు. నా టాక్సీని మా ఓనర్ కొత్తగా వచ్చిన ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీకి ఎక్కువ డబ్బుకి అద్దెకిచ్చాడు... నేను ఓ స్కూల్లో లెక్కలు, ఫిజిక్స్ చెప్పుకుంటున్నాను... నా కల నిజమవడానికి ప్రయత్నంగా ఈ ఉత్తరం. మీరు తెలుగులో రాయండి. మీ భాష ఇంప్రూవ్ అవుతుంది. నేను ఇంగ్లీషులో రాస్తాను..." నా భాష ఇంప్రూవ్ అవుతుంది.

నా మనసుని ఆలోచనల ఆకాశంలోకి విసిరేసింది ఆ ఉత్తరం...!

(సుజన రంజని సిలికాన్ ఆంధ్ర ఏప్రిల్ 2006)

★ ★ ★ ★ ★ ★